# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 04-09-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రంలోని ప్రజలందరికీ ఆరోగ్య బీమా కల్పిస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది.
- ❖ దేశంలోని మధ్య తరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం భావితరం జీఎస్టీ సంస్కరణలను తీసుకొచ్చింది.
- ❖ ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్) వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 15 నుంచి 20 వరకు విశాఖపట్నంలో జరగనుంది.
- ❖ బంగాళాఖాతంలోని అల్పపీడనం బలహీనపడిందని భారత వాతావరణ విభాగం వెల్లడించింది.

==========================

రాష్ట్రంలోని ప్రజలందరికీ ఆరోగ్య బీమా కల్పిస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈ రోజు జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. ఆయుష్మాన్ భారత్-ఎన్టీఆర్ వైద్యసేవా పథకం కింద యూనివర్సల్ హెల్త్ పాలసీకి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీని ద్వారా ఒక్కో కుటుంబానికి ఏడాదికి 25 లక్షల రూపాయల వరకూ ఉచిత చికిత్స పొందేలా నూతన విధానానికి క్యాబినెట్ ఆమోద ముద్ర వేసింది. అదేవిధంగా పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో కొత్తగా 10 వైద్య కళాశాలలను రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఆదోని, మదనపల్లె, మార్కాపురం, పులివెందుల, పెనుగొండ, పాలకొల్లు, అమలాపురం, నర్సీపట్నం, బాపట్ల, పార్వతీపురంలో మొత్తం రెండు దశల్లో ఈ వైద్య కళాశాలలు ఏర్పాటు చేయబోతున్నామని రాష్ట్ర ప్రజా సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి పాత్రికేయులకు వెల్లడిస్తూ....

(వాయిస్ 40 సెకన్లు)

==========================

దేశంలోని మధ్య తరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం భావితరం జీఎస్టీ సంస్కరణలను తీసుకొచ్చింది. 79వ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దీపావళి కానుకగా జీఎస్టీ సంస్కారణలను తీసుకొస్తామని చెప్పారు. నిన్న జరిగిన 56వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఇప్పటివరకూ వస్తు సేవల పన్ను జీఎస్టీ 4 శ్లాబ్స్ గా ఉండగా ఇకపై రెండు శ్లాబ్స్ గా ఉండనుంది. పాల ఉత్పత్తులు, పండ్లు, ఆహార ఉత్పత్తులు మొదలగు వాటిపై 12 శాతంగా ఉన్న జీఎస్టీ ఇక నుంచి 5 శాతం మాత్రమే అమలవుతుంది. ముఖ్యంగా రైతులు సామాన్య ప్రజలను దృష్టిలో పెట్టుకునే ఈ సంస్కరణలను ప్రవేశపెడుతున్నామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడిస్తూ..

(వాయిస్ 14 సెకన్లు)

జీఎస్టీ శ్లాబ్స్ ను తగ్గిస్తూ.. కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ సంస్కరణలతో నిత్యావసరాలు, విద్యా, ఆరోగ్యరంగం, వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించిన పన్నులు గణనీయంగా తగ్గుతాయని ముఖ్యమంత్రి సామాజిక మాధ్యమం ఎక్స్ లో పేర్కొన్నారు.

==========================

ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్) వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 15 నుంచి 20వ తేదీ వరకు విశాఖపట్నంలో జరగనుంది. `ఐఎఫ్ఆర్ - 2026` నిర్వహణకు అధికార యంత్రాంగం సన్నద్ధంగా ఉండాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులకు సూచించారు. ఐఎఫ్ఆర్ సమన్వయ కమిటీ సభ్యులైన పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, డీసీపీ అజిత, కమాండర్ వై.కె. కిశోర్, వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల ప్రతినిధులతో ఈరోజు ఆయన కలెక్టరేట్ మీటింగు హాలులో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 15 - 20 వరకు ఐఎఫ్ఆర్ తో పాటు, మిలాన్ వేడుకలు కూడా జరుగుతాయని, దానికి సంబంధించిన ఏర్పాట్లు కూడా చేసుకోవాలని సూచించారు. రాష్ట్రపతి, ప్రధానమంత్రి, ఇతర ప్రముఖులతో పాటు, సుమారు 135 దేశాల నుంచి ప్రతినిధులు ఐఎఫ్ఆర్ వేడుకల్లో భాగస్వామ్యం అవుతారని, కావున అందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు.

==========================

గుంటూరు రూరల్ మండలంలోని తురకపాలెంలో గత కొద్ది నెలలుగా సంభవిస్తున్న మరణాలకు గల కారణాలపై అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈ రోజు సమీక్షించారు. సాధారణ సరళికి భిన్నంగా జులై నుంచి సెప్టెంబరు 3వ తేదీ మధ్య 23 మరణాలు సంభవించడానికి గల కారణాలు తెలియకపోవడంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. బాధితుల రక్త నమూనాల పరీక్షల ఫలితాలకు అనుగుణంగా త్వరలో తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలోని ప్రజలందరికీ కిడ్నీల పనితీరు పరీక్షలు, హెచ్ బీఎ1సీ (షుగర్), బీపీ టెస్టులు నిర్వహించాలని మంత్రి ఆదేశించారు.

విరామం

==========================

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్ ఈరోజు కృష్ణా జిల్లా మచిలీపట్నంలో జరిగిన సారధ్యం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఛాయ్ పే చర్చాలో పలువురు ప్రముఖులతో మాట్లాడి.. మచిలీపట్నంలో ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో చేయవలసిన కార్యాచరణను రూపొందించి వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 పథకం ద్వారా 47 అభివృద్ధి కార్యక్రమాలకు వందల కోట్ల రూపాయల నిధులను కేటాయించిందని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. కోస్టల్ కారిడార్ అభివృద్ధి పథంలో భాగంగా పోర్టు అనుసంధానిత పరిశ్రమలను స్థాపించి యువతకు ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పీవీఎన్ మాధవ్ వెల్లడిస్తూ...

(వాయిస్ 31 సెకన్లు)

==============================

జీఎస్టీ భారాన్ని తగ్గించడం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజల భవిష్యత్‌కు మరింత భరోసా కల్పించే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తెలుగుదేశం పార్టీ స్వాగతిస్తోందని ఆ పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. నిత్యావసర వస్తువులు, వైద్యం, విద్య, వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ రేట్లను తగ్గించడం ద్వారా సామాన్య ప్రజలు, రైతుల కొనుగోలు శక్తి గణనీయంగా పెరుగుతుందన్నారు. 33 రకాల అత్యవసర ఔషధాలపై జీఎస్టీ రద్దు, ఇతర మందులపై పన్ను శాతాన్ని తగ్గించడం వల్ల ఆరోగ్య ఖర్చులు తగ్గి, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు, సామాన్య కుటుంబాలకు పెద్ద ఉపశమనం లభిస్తుందన్నారు.

==============================

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన తాజా జీఎస్టీ శ్లాబ్స్ హేతుబద్ధీకరణతో రాష్ట్ర వ్యాప్తంగా హర్షాతిరేఖాలు వ్యక్తమవుతున్నాయి. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన కె.కె.వి.నాయుడు జీఎస్టీ సంస్కరణలపై ఈరోజు ఆకాశవాణితో మాట్లాడుతూ... ఇది చాలా శుభపరిణామమని, దేశ ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. జీఎస్టీ తగ్గింపుల వల్ల పేదలు, మధ్యతరగతి ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 33 సెకన్లు)

==============================

రైతులు ఎరువుల కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పశ్చిమగోదావరి జిల్లా సంయుక్త కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి చెప్పారు. ఈ రోజు పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు సంబంధించిన గోడౌన్ ను, ఎరువులు దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. యూరియా నిల్వలకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... జిల్లాలో ఎరువులు కొరత లేదని సరిపడనంత నిల్వలు సొసైటీలో అందుబాటులో వుంచామని తెలిపారు.

==============================

ఉత్తర ఒడిశా, దాని పరిసర ప్రాంతాలలోని తీవ్ర అల్పపీడనం పశ్చిమ వాయువ్య దిశగా కదిలి, ఈరోజు ఉత్తర ఛత్తీస్‌గఢ్ పరిసర ప్రాంతాలలో అల్పపీడనంగా బలహీనపడింది. రానున్న 24 గంటల్లో తూర్పు మధ్యప్రదేశ్ మీదుగా కదిలే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ విభాగం వెల్లడించింది. దీని ప్రభావంతో ఉత్తర కోస్తాంధ్రలో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ అధికారిణి లక్ష్మీ పేర్కొంటూ...

(వాయిస్ 26 సెకన్లు)

==============================
==============================